గోల్డ్ మారథాన్

తొలిసారి తులం ధర రూ.74వేలపైకి

రోజుకో రికార్డును సృష్టిస్తూ బంగారం పరుగులు • మరో ఆల్‌టైమ్ హైకి చేరిక.. వెండి రేట్లూ కొత్త గరిష్ఠానికి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: గోల్డ్ మార్కెట్ రోజుకో రికార్డుతో షేక్ చేస్తున్నది. మునుపెన్నడూ లేనివిధంగా బంగారం ధరలు సరికొత్త స్థాయిల్లో కదలాడుతున్నాయి మరి. మంగళవారం పుత్తడి విలువ ఏకంగా 74వేలపైకి చేరింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు ఆల్‌టైమ్ హైని తాకుతూ తొలిసారి రూ.74,130గా నమోదైంది. సోమవారం ముగింపుతో చూస్తే ఒక్కరోజే రూ.980 ఎగబాకింది. అంతకుముందు రోజూ రూ.600 ఎగబాకిన విషయం తెలిసిందే. ఇక ఢిల్లీలో ఈ పెరుగుదల రూ.73,750గా ఉన్నది. కాగా, స్పాట్ మార్కెట్‌లో పన్నులతో కలుపుకొని మేలిమి బంగారం ధర తులం రూ.75,000 దాటడం గమనార్హం.

మూడున్నర నెలల్లో రూ.10వేలపైనే

గడిచిన మూడున్నర నెలల్లో పుత్తడి రేటు తులం ఏకంగా రూ.10వేలపైనే పెరగడం విశేషం. ఈ ఏడాది జనవరి 1న హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.63,870 వద్ద ముగిసింది. ఇప్పుడు రూ.74,130 వద్ద స్థిరపడింది. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.10,260 ఎగిసినట్టైంది. 22 క్యారెట్ (నగల బంగారం) కూడా నాడు తులం రూ.58,550 మాత్రమే. నేడు రూ.67,950. రూ.9,400 పెరిగింది.

కిలో వెండి రూ.87వేలు

హైదరాబాద్‌లో కేజీ వెండి రేటు కొత్త రికార్డును సృష్టిస్తూ రూ.87,000కు చేరింది. ఈ ఒక్కరోజే రూ.1,000 పెరిగింది. ఢిల్లీలోనూ రూ.800 ఎగిసి రూ.86,500గా ఉన్నది. ఇక ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా వెండి ధర కిలోకు రూ.8,400 పుంజుకున్నది. జనవరి 1న రూ.78,600 వద్ద ముగిసినట్టు రికార్డులు చెప్తున్నాయి. మరోవైపు గ్లోబల్ మార్కెట్‌లో పసిడి విలువ ఔన్సు 2,370 డాలర్లుగా ఉన్నది. వెండి 28.40 డాలర్లు పలికింది.

బంగారం ధరల పెరుగుదలకు కారణాలు

- స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకులు
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- సురక్షిత పెట్టుబడి సాధనంగా మదుపరులు భావిస్తుండటం
- పెండ్లిళ్లు, పండుగల సీజన్
- ఆర్బీఐ, ఇతర దేశాల సెంట్రల్ బ్యాంకులు బంగారం నిల్వల్ని పెంచుకుంటుండటం

సరికొత్త మహీంద్రా బొలెరో

ప్రారంభ ధర రూ.11.39 లక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: దేశీయ మార్కెట్‌కు సరికొత్త బొలెరోను పరిచయం చేసింది మహీంద్రా అండ్ మహీంద్రా. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా బొలెరో నియో ప్లస్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. తొమ్మిది మంది కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.11.39 లక్షలుగాను, గరిష్ఠంగా రూ. 12.49 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్ రూ.1.50 లక్షల వరకు అధికం. ఈ కారును కొనుగోలు చేయాలనుకునేవారు ఆన్‌లైన్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రుపీ

ఒక్కరోజే 17 పైసలు పతనం • మొదటిసారి 83.61 స్థాయికి క్షీణత

ముంబై, ఏప్రిల్ 16: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయింది. మంగళవారం ఒక్కరోజే 17 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 83.61 వద్ద నిలిచింది. దీంతో ఇప్పటిదాకా ఉన్న 83.48 రికార్డు కనుమరుగైపోయింది. గత నెల మార్చి 22న ఈ కనిష్ఠ రికార్డు నమోదైన విషయం తెలిసిందే. కాగా, స్టాక్ మార్కెట్ల నష్టాలు, డాలర్లకు డిమాండ్, అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తకర పరిస్థితుల నేపథ్యంలోనే రుపీ ఈ స్థాయిలో పతనమైందని ఫారెక్స్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం ఆరంభం నుంచే రుపీ నష్టాల్లో ట్రేడైంది. సోమవారం 83.44 వద్ద ముగిసినా.. మంగళవారం 83.51 వద్ద మొదలైంది.

ఇలాగైతే కష్టమే..

రూపాయి విలువ ఇలాగే పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థపై ఆ ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందన్న ఆందోళనలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. విదేశాల నుంచి దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులు, సేవలు ఖరీదెక్కుతాయని, ఇది ద్రవ్యోల్బణానికి దారి తీయగలదంటున్నారు. ఇదే జరిగితే ఇప్పటికే వడ్డీరేట్లను హైలోనే ఉంచుతున్న ఆర్బీఐ.. మరికొంత కాలం కోతల జోలికి పోదని, అప్పుడు రుణ భారం పెరిగి అన్ని రంగాలు కుదేలవుతాయన్న అంచనాలున్నాయి.

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. సెన్సెక్స్ 456.10 పాయింట్లు నష్టపోయి 72,943.68 వద్దకు జారుకున్నది. నిఫ్టీ 124.60 పాయింట్లు కోల్పోయి 22,147.90 వద్దకు పడిపోయింది. ఇక గత మూడు సెషన్లలో రూ.8 లక్షల కోట్ల సంపద కరిగిపోయింది. కాగా, శ్రీ రామనవమి సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లు మూసివేసివుంచనున్నారు. తిరిగి గురువారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు తెరుచుకోనున్నాయి.

ఫ్లిప్‌కార్ట్ వార్షిక సేల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. వార్షిక సేల్‌ను ప్రకటించింది. బుధవారం నుంచి 23 వరకు గృహోపకరణాలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కూలర్లు, ఫాన్లను తక్కువ ధరకే విక్రయిస్తుంది. ఆరోసారి ప్రకటించిన ఈ ఆఫర్లపై నో-కాస్ట్ ఈఎంఐ, డౌన్ పేమెంట్, క్యాష్ ఆన్ డెలివరీ, ఫ్లిప్‌కార్ట్ పే లేటర్ ఈఎంఐ చెల్లింపులు జరుపుకోవచ్చు. రూ.9,990 నుంచి రూ.2 లక్షల మధ్య రిఫ్రిజిరేటర్లు, రూ.25వేలు-రూ.65వేల మధ్య ఏసీలు, రూ.1,299-రూ.15వేలలోపు సీలింగ్ ఫ్యాన్లను విక్రయిస్తున్నది.

విస్తరణపై ది స్లీప్ దృష్టి

హైదరాబాద్, ఏప్రిల్ 16: బ్రాండెడ్ పరుపుల విక్రయ సంస్థ ది స్లీప్ కంపెనీ.. హైదరాబాద్‌లో మరో స్టోర్‌ను ప్రారంభించింది. దీంతో నగరంలో సంస్థకు ఇది 8వ స్టోర్ కాగా, దేశవ్యాప్తంగా 75వ స్టోర్ కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్ ప్రియాంకా సాలోట్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో 12 స్టోర్లు ఉండగా, వచ్చే ఏడాది చివరి నాటికి వీటిని రెండింతలు పెంచనున్నట్లు ఆమె ప్రకటించారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో బెంగళూరు, హైదరాబాద్ వాటా అధికంగా ఉండటంతో ఇక్కడి వ్యాపారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అలాగే 2023లో రూ.350 కోట్లుగా ఉన్న టర్నోవర్, రెండు నుంచి మూడేండ్లకాలంలో రూ.1,000 కోట్లకు చేరుకుంటున్నదని ఆశిస్తున్నట్లు తెలిపారు.

బట్లర్ (107*)

రాయల్స్ జోష్

కోల్‌కతాపై రాజస్థాన్ సంచలన విజయం

బట్లర్ సూపర్ సెంచరీ • ఐపీఎల్‌లో అత్యుత్తమ లక్ష్యఛేదన

కోల్‌కతా: పేరుకు తగ్గట్టే రాజస్థాన్ 'రాయల్స్' విక్టరీ కొట్టింది. కోల్‌కతా నిర్దేశించిన 224 పరుగుల ఛేదనలో ఒకదశలో గెలుపు కష్టమనుకున్న మ్యాచ్‌లో జోస్ బట్లర్ (60 బంతుల్లో 107 నాటౌట్, 9 ఫోర్లు, 6 సిక్సర్లు) అసాధ్యాన్ని సుసాధ్యం చేసి రాజస్థాన్‌కు అనూహ్య విజయాన్ని అందించాడు. ఛేదనలో 8 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. ఐపీఎల్ చరిత్రలో భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన జట్టుగా రాజస్థాన్ రికార్డుల్లోకెక్కింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కేకేఆర్ ఓపెనర్ సునీల్ నరైన్ (56 బంతుల్లో 109, 13 ఫోర్లు, 6 సిక్సర్లు) శతకంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. బ్యాట్‌తో సెంచరీ బాదిన నరైన్ బౌలింగ్ (2/30)లోనూ రాణించాడు. బట్లర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు ఇది ఆరో విజయం కాగా కోల్‌కతాకు రెండో పరాభవం.

నరైన్ ధనాధన్..

ఈ సీజన్‌లో ఓపెనర్‌గా వస్తూ సంచలన ఇన్నింగ్స్‌లు ఆడుతున్న నరైన్ మరోసారి రెచ్చిపోయాడు. ఆరంభంలో నెమ్మదిగానే ఆడిన నరైన్ ఆరో ఓవర్ నుంచి జోరు పెంచాడు. గత మ్యాచ్‌లో రాణించిన ఫిల్ సాల్ట్ (10) విఫలమైనా అంగ్‌క్రిష్ రఘువంశీ (18 బంతుల్లో 30, 5 ఫోర్లు) కలిసి కేకేఆర్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కుల్‌దీప్‌సేన్ ఆరో ఓవర్లో భారీ సిక్సర్‌తో విధ్వంసానికి తెర తీసిన నరైన్.. 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. రఘువంశీ, శ్రేయస్ అయ్యర్ (11), ఆండ్రీ రస్సెల్ (13) విఫలమైనా నరైన్ మాత్రం ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అశ్విన్ 12వ ఓవర్లో 6, 4, 4 బాదిన అతడు.. 16వ ఓవర్ వేసిన చాహల్ బౌలింగ్‌లో 6, 4, 6, 4తో 49 బంతుల్లోనే తన కెరీర్‌లో తొలి టీ20 శతకాన్ని నమోదుచేశాడు. ఆఖర్లో రింకూ సింగ్ (9 బంతుల్లో 20 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

రాజస్థాన్ తడబాటు..

భారీ ఛేదనలో రాజస్థాన్ బ్యాటర్లూ బ్యాట్‌కు పనిచెప్పినా ఎవరూ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయారు. క్రీజులో ఉన్నంతసేపు జైస్వాల్ (9 బంతులతో 19, 3 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ పరాగ్ దంచికొట్టారు. కెప్టెన్ శాంసన్ (12) నిరాశపరిచాడు. వైభవ్ అరోరా వేసిన 6వ ఓవర్లో బట్లర్ ఓ సిక్సర్ బాదగా పరాగ్.. 4, 6, 4 తో 23 పరుగులు రాబట్టారు. హర్షిత్ 8వ ఓవర్లో 6,4 కొట్టిన పరాగ్.. అదే ఓవర్లో భారీ షాట్ ఆడి రస్సెల్ చేతికి చిక్కాడు. ధ్రువ్ జురెల్ (2) మరోసారి చేతులెత్తేశాడు. వరుసగా వికెట్లు కోల్పోవడంతో 9వ ఓవర్ నుంచి రాజస్థాన్ స్కోరు వేగం నెమ్మదించింది. 9వ ఓవర్ నుంచి 14 వ ఓవర్ దాకా ఆ జట్టు 30 పరుగులు మాత్రమే చేయగలిగింది.

బట్లర్ 'జోష్'...

15వ ఓవర్ తర్వాత బట్లర్ గేర్ మార్చాడు. చక్రవర్తి 15వ ఓవర్లో 4 ఫోర్లు కొట్టగా.. అశ్విన్ (8) స్థానంలో వచ్చిన రోవ్‌మన్ పావెల్ (13 బంతుల్లో 26, 1 ఫోర్, 3 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడటంతో ఆఖరి 3 ఓవర్లలో ఆ జట్టు విజానికి 46 పరుగులు అవసరమయ్యాయి. పావెల్ నిష్క్రమించినా అవేశ్ ఖాన్ (0 నాటౌట్)ను నాన్ స్ట్రైయికర్ ఎండ్‌లో నిలబెట్టి దంచికొట్టాడు. స్టార్క్ 17వ ఓవర్లో 18 పరుగులు రాబట్టిన బట్లర్.. హర్షిత్ రాణా ఓవర్లో 19 పరుగులు పిండుకోవడంతో పాటు ఈ లీగ్‌లో ఏడో సెంచరీ పూర్తిచేశాడు. వరుణ్ చక్రవర్తి ఆఖరి ఓవర్లో చివరి బంతికి విన్నింగ్ రన్ కొట్టి కేకేఆర్ ఆశలపై నీళ్లు చల్లాడు.

నరైన్ (109)

నరైన్ సుడిగాలి సెంచరీ వృథా

3 నరైన్ శతకం ఐపీఎల్‌లో కేకేఆర్‌కు మూడోవది. ఈ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో బ్రెండన్ మెక్‌కల్లమ్.. ఆర్సీబీపై 158 పరుగులు చేయగా గత సీజన్‌లో వెంకటేశ్ అయ్యర్ (104) ముంబైపై సెంచరీ బాదాడు.

7 ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడం ద్వారా బట్లర్ ఐపీఎల్‌లో ఏడో శతకాన్ని పూర్తిచేశాడు. కోహ్లీ (8) అతడి కంటే ముందున్నాడు.

1 ఐపీఎల్‌లో బౌలర్‌గా వందకు పైగా వికెట్లు తీసి బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన తొలి ఆటగాడు సునీల్ నరైన్. 503 మ్యాచ్‌లు ఆడిన అతడికి ఇదే తొలి శతకం. అంతకుముందు అతడి హయ్యెస్ట్ స్కోరు 85 పరుగులు.

సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా : 20 ఓవర్లలో 223/6 (నరైన్ 109, రఘువంశీ 30, అవేశ్ 2/35, కుల్దీప్ 2/46). **రాజస్థాన్:** 20 ఓవర్లలో 224/8 (బట్లర్ 107 నాటౌట్, పరాగ్ 34, నరైన్ 2/30, వరుణ్ 2/36)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	7	6	1	0.67	12
కోల్‌కతా	6	4	2	1.39	8
చెన్నై	6	4	2	0.72	8
హైదరాబాద్	6	4	2	0.50	8
లక్నో	6	3	3	0.03	6
గుజరాత్	6	3	3	-0.63	6
పంజాబ్	6	2	4	-0.21	4
ముంబై	6	2	4	-0.23	4
ఢిల్లీ	6	2	4	-0.97	4
బెంగళూరు	7	1	6	-1.18	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

గుకేశ్ గేమ్ డ్రా

• క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన పదో రౌండ్‌లో బరిలో దిగిన గుకేశ్..రష్యా జీఎం ఇయాన్ నెపోనియాచితో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. విదిత్ గుజరాతి, ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ కూడా డ్రాగా ముగిసింది. మరో నాలుగు రౌండ్లు మిగిలున్న టోర్నీలో ఆరేసి పాయింట్లతో గుకేశ్, నెపోనియాచి టాప్‌లో కొనసాగుతున్నారు.సలీమోవా చేతిలో వైశాలి ఓడగా, హంపి డ్రా చేసుకుంది.

మ్యాక్సీ ఔట్!

ఐపీఎల్‌కు ఆర్సీబీ స్టార్ బ్యాటర్ దూరం

బెంగళూరు: ఐపీఎల్ తాజా సీజన్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌లకు గాను ఆరింటిలో ఓడి ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడ్డ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు మరో షాక్. ఆ జట్టు స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ కొంతకాలం ఐపీఎల్ నుంచి బ్రేక్ తీసుకోవాలని నిశ్చయించుకున్నాడు. మానసిక, శారీరక అలసట కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అతడు చెప్పాడు. మ్యాక్సీ మాట్లాడుతూ... 'ముంబైతో గేమ్‌కు ముందు నేను ఫాఫ్ (డుప్లెసిస్) వద్దకు వెళ్లి నా ప్లేస్‌లో మరెవరినైనా తీసుకోవాలని సూచించా. మానసికంగా, శారీరకంగా విశ్రాంతి తీసుకోవడానికి ఇదే సరైన సమయమని భావించా. త్వరలోనే బలంగా తిరిగొస్తా' అని అన్నాడు.

విశ్వక్రీడల 'జ్యోతి' వెలిగింది

ఒలింపియా: ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న పారిస్ ఒలింపిక్స్‌కు ముందు విశ్వక్రీడల పుట్టినిల్లు అయిన గ్రీస్‌లోని ఒలింపియాలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మంగళవారం వేలాది మంది ప్రేక్షకుల సమక్షంలో ఒలింపియాలోని 2600 ఏండ్ల నాటి హీరా ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నటి మేరి మిన జ్యోతి ప్రజ్వలన చేసి దానిని టోక్యో ఒలింపిక్స్‌లో రోయింగ్ విజేత స్టెఫనోస్‌కు అందించింది.

SELECT MOTORS
Karimnagar, Jagityal, Metpally, Mancherial, Ramagundam: 7506025381

SREE VENKATESHWARA MOTORS
Adilabad: 7506025451; Nirmal: 8291048996; Bodhan: 7506025451

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.